సాక్షి
రంగారెడ్డి

సోమవారం ¦ 2 ¦ జూన్ ¦ 2025

❖ అవతరణ కాంతులు



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహించే వేడుకలకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, మండల ప్రజా పరిషత్‌లను విద్యుత్ దీపాలు, రంగురంగుల కాగితాలతో అలంకరించారు. జాతీయ పతాకాల ఆవిష్కరణలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

– ఇబ్రహీంపట్నం

న్యూస్‌రీల్

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న రాములు

షాద్‌నగర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో భగవద్గీతపై రెండు రాష్ట్రాల మధ్య పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో పట్టణానికి చెందిన రాములు ప్రతిభ కనబరిచాడు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను అలవోకగా ఆలపించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు రాములును శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి అధ్యక్షుడు స్వరాజ్‌బాబు, కార్యదర్శి నక్కనర్సింలు అభినందించారు.

హరీశ్‌రావుకు ఘన స్వాగతం



షాద్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం అంజన్న తండాలో ఆదివారం పార్టీ నాయకుడు నిర్వహించిన విందుకు వెళ్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు షాద్‌నగర్ ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని కేశంపేట చౌరస్తాలో నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు రాంబల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, ఈట గణేశ్, చందు, నర్సింగ్‌రావు, విజయ్, లక్ష్మణ్ నాయక్, మోతీలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఫలితాలు సొంతం




విద్యార్థికి నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

ఇబ్రహీంపట్నం రూరల్: లక్ష్య సాధన కోసం కష్టపడి చదివితేనే ఫలితాలు సొంతం అవుతాయని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇబ్రహీంపట్నం, యాచారం మండలాలకు చెందిన విద్యార్థులకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు- 2025 ప్రదానం చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటాచారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి తమ లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం 120 మంది విద్యార్థులకు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, అంబర్‌పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన ఎక్సైజ్ కార్యాలయం పైకప్పు

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లలో అపశృతి చోటు చేసుకుంది. ఎక్సైజ్‌శాఖ కార్యాలయం పై కప్పు కూలి ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన ఘటన షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. పట్టణంలోని ప్రభుత్వ ఎక్సైజ్‌శాఖ కార్యాలయం కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకోసం అధికారులు కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా కార్యాలయంపై జెండా దిమ్మెను కట్టేందుకు కానిస్టేబుల్ విజయకుమార్ ఆదివారం భవనంపైకి ఎక్కాడు. పై కప్పు అకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పరేషన్!

ఒకేసారి మూడు నెలల సరుకులతో తప్పనితిప్పలు

- వేర్వేరుగా చూపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లాగిన్
- ఒక్కో కార్డుదారుడికి రెండు దఫాలుగా తూకం
- జిల్లాలో తెరుచుకోని కొన్ని దుకాణాలు
- తొలిరోజు పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల పాట్లు



ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు

ఈ నెల 30 వరకు అవకాశం

రేషన్ సరుకుల పంపిణీ ఈ నెల 30 వరకు ఉంటుంది. గతంలో 15వ తేదీ తరువాత పంపిణీ నిలిచిపోయేది. తాజాగా మూడు నెలల సరుకులు ఒకేదఫా ఇవ్వాలన్న నిర్ణయంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ నెల 30 వరకు లబ్ధిదారులకు రేషన్ దుకాణాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఫలితంగా కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మూడు నెలల రేషన్ సరుకులు ఒకేసారి పంపిణీ చేసే విధానంతో తొలిరోజు జిల్లాలోని రేషన్ డీలర్లు, లబ్ధిదారులు ముప్పుతిప్పలు పడ్డారు. మూడు నెలలకు సంబంధించిన సరుకులు ఒకే దఫా ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఒక్కో కార్డుదారుడికి బియ్యం పంపిణీలో ఆరు దఫాలు తూకం వేయాల్సి వస్తోంది. ఆరుసార్లు థంబ్ వేయాల్సి వస్తోంది. ఈ సమయంలో సర్వర్ డౌన్, ఇతర సమస్యలు చిరాకు తెప్పిస్తున్నాయని పలువురు వాపోయారు. బియ్యం పంపిణీ పూర్తయిన తర్వాత కూడా స్టాక్‌లో రేషన్ కట్ కాకపోవడంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో కార్డుకు బియ్యం ఇవ్వడానికి కనీసం 20 నిమిషాల నుంచి అరగంట పడుతోంది. కొన్ని రేషన్ దుకాణాల్లో సర్వర్ డౌన్ కావడంతో లబ్ధిదారులు బారులు తీరారు. ఎండలో ఎదురుచూసి, ఓపిక నశించి వెనుదిరిగారు. మరి కొన్ని చోట్ల డీలర్లకు సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడం, ఇతర సమస్యలతో రేషన్ దుకాణాలను తెరవలేదు. పలు దుకాణాల్లో సర్వర్ డౌన్ కావడంతో మూడు గంటలకు కేవలం ఒకరిద్దరికి మాత్రమే బియ్యం అందించారు. దీంతో దుకాణాల ఎదుట భారీగా బారులు తీరిన జనం డీలర్లతో వాగ్వాదానికి దిగారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో అవస్థలు

రేషన్ సరుకుల పంపిణీలో కొత్త సాఫ్ట్ వేర్ కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఒక్కో వ్యక్తికి అందించాల్సిన ఆరు కిలోల బియ్యాన్ని విభజించి చూపిస్తోంది. కేంద్రం ఇచ్చే ఐదు కిలోల బియ్యం ఒక దఫా తూకం వేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక్క కేజీ బియ్యం కోసం మరో దఫా తూకం వేయాల్సి వస్తోంది. ఒక నెలకు ఒక కార్డుదారుకు రెండు దఫాలు తూకం వేయాల్సి వస్తోంది. ఇలా మూడు నెలలకు ఆరు దఫాలు అన్నమాట. దీంతో చాలా సమయం వృథా అవుతోందని డీలర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చే స్టాక్ గతంలో ఆటోమేటిక్‌గా డీలర్ డివైజ్‌లో కనిపించేది. ఇప్పుడు అప్‌డేట్ కావడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి పంపిణీ వ్యవస్థను వ్యతిరేకించాలని డీలర్ల సంఘం పిలుపునిచ్చింది. దీనిపై పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని డీలర్లు కోరుతున్నారు.

తెరిచారు.. మూశారు

కందుకూరు: మండలంలోని 46 రేషన్ దుకాణాల నుంచి ఆదివారం లబ్ధిదారులకు బియ్యం ఇవ్వాల్సి ఉండగా సాఫ్ట్‌వేర్ సమస్యతో సరఫరాను నిలిపివేశారు. ఒక్కో లబ్ధిదారు ఆరుసార్లు వేలిముద్రల స్కాన్ చేయాల్సి రావడంతో పాటు తీసుకుంటున్న రేషన్ బియ్యం అసలు స్టాక్ నుంచి తగ్గడం లేదు. దీంతో పాటు ఇతర సాఫ్ట్‌వేర్ సమస్యలు నెలకొన్నట్లు రేషన్ డీలర్లు వాపోతున్నారు. మరోవైపు వేలిముద్ర స్కాన్‌తో పాటు తప్పనిసరిగా మొబైల్ నంబర్ నమోదు చేయాలి. చాలామందికి మొబైల్ ఉండకపోవడం, ఒక్కో లబ్ధిదారుకు దాదాపు అరగంట సమయం పడుతుండటంతో ఇటు డీలర్లు, అటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తొలిరోజు కొన్ని గ్రామాల్లో రేషన్ షాపులు తెరిచి ఒకరిద్దరికి బియ్యం ఇవ్వగా అవి అసలు స్టాక్ నుంచి తగ్గకపోవడంతో అధికారుల సూచనల మేరకు నిలిపివేశారు.

సగం దుకాణాలకే కోటా



రుద్రారంలో బియ్యం తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

షాబాద్: మండలం మొత్తం 37 రేషన్ షాపులు ఉండగా ఆదివారం 15 దుకాణాల్లో మాత్రమే పంపిణీ చేశారు. రుద్రారం గ్రామంలో రేషన్ తీసుకునేందుకు లబ్ధిదారులు బారులు తీరారు. మండలంలో ఏడు షాపులకు పూర్తి బియ్యం సరఫరా కాగా, మిగతా దుకాణాలకు సగం కోటా సరఫరా చేసినట్లు డీలర్లు చెప్పారు. రేషన్ షాపుల వద్ద సర్వర్ సమస్య, బయో మెట్రిక్ సమస్యతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకరికి రేషన్ తీసుకునేందుకు 15 నిమిషాల వరకు సమయం పట్టింది.



కొత్తూరులో మూసి ఉన్న రేషన్ దుకాణం

పంపిణీలో జాప్యం

షాద్‌నగర్: మూడు నెలలకు సంబంధించి కోటాను ఆదివారం నుంచి ఒకేసారి అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సర్కారు నిర్ణయించినా రేషన్ దుకాణాలకు మాత్రం పావు వంతు కూడా సరఫరా కాలేదు. నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్‌లో 55 రేషన్ దుకాణాల్లో మూడు నెలలకుగాను 1,632 టన్నులు, కేశంపేటలో 29 దుకాణాలకు 682, కొత్తూరులో 13 షాపులకు 525, నందిగామలో 12 దుకాణాలకు 486, కొందుర్గులో 19 దుకాణాలకు 475, చౌదరిగూడలో 22 షాపులకు 505 టన్నుల బియ్యాన్ని స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. ఫరూఖ్‌నగర్‌కు 439 టన్నులు, కేశంపేటకు 93, కొందుర్గుకు 268, నందిగామకు 25, కొందుర్గుకు 60, చౌదరిగూడకు 48 టన్నుల బియ్యాన్ని పంపించారు. మొత్తం 4,312 టన్నులకు గాను సుమారు 1,200 టన్నుల మాత్రమే సరఫరా చేశారు. గత నెల 24వ తేదీ నుంచి అధికారులు బియ్యాన్ని లారీల ద్వారా సరఫరా చేస్తున్నా నేటికీ పూర్తి కాలేదు.

గంటల తరబడి.. జనాల తాకిడి

ఇబ్రహీంపట్నం: ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీకి ఆదివారం మొదటిరోజు అడ్డంకులు ఎదురయ్యాయి. దుకాణాల్లోని ఈ పాస్ సర్వర్లు మొరాయించడంతో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యం కోటాలకు ఒకేసారి కాకుండా వేర్వేరుగా ఈ పాస్ మిషన్లపై వేలిముద్రలు వేయాల్సివచ్చింది. ఒక్కో కార్డుదారుడు ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సి పరిస్థితి వచ్చింది. దీనికితోడు సర్వర్లు మొరాయిస్తుండంతో ఒక్కొక్కరికి 15 నుంచి 20 నిమిషాలు సమయం పట్టింది. ఆయా దుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షించడం కనిపించింది. కొన్ని దుకాణాలను తెరవనేలేదు. నెలనెలా వచ్చే బాధ తప్పిందని భావించిన లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పలేదు.

చర్యలు తీసుకోవాలి



మూడు నెలల సన్న బియ్యం ఒకేసారి ఇస్తున్నారంటే సంతోషపడ్డాం. ప్రతీనెల రావాల్సిన పనితప్పిందని అనుకున్నాం. కానీ మిషన్లు సతాయిస్తుండటంతో గంటల తరబడి షాపు వద్ద ఎదురుచూడాల్సి వచ్చింది. సమయం వృథా అవుతోంది. కార్డుదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

– బాల్‌రాజ్, ఇబ్రహీంపట్నం



ఈ పాస్ మిషన్‌లో వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారుడు

స్లాట్ బుకింగ్ @సబ్ రిజిస్ట్రార్



ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- ఇబ్రహీంపట్నంలో నేటి నుంచి అమల్లోకి..
- అదనంగా మరో సబ్‌రిజిస్ట్రార్ కేటాయింపు
- 15 నిమిషాల్లోపు పూర్తికానున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- తగ్గనున్న పని భారం.. నిరీక్షణకు తెర

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ విధానం సోమవారం నుంచి అమలులోకి రానుంది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఏప్రిల్ 10న శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మొదటగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. గత నెల 12న మరో 25 కార్యాలయాల్లో ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన అన్ని కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ విధానం పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సమయం ఆదా

స్లాట్ విధానంతో కేవలం 15 నిమిషాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. గంటల తరబడి కార్యాలయాల్లో క్రయవిక్రయదారులు నిరీక్షించాల్సిన తిప్పలు తప్పనున్నాయి. సమయం ఆదా కానుంది.

పొరపాట్లకు తావులేకుండా..

స్లాట్ బుకింగ్ వ్యవస్థ అమలులోకి రానున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నానికి అదనంగా మరో సబ్‌రిజిస్ట్రార్ రానున్నారు. అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాల్లో ఎలాంటి పొరబాట్లు జరగకుండా త్వరతిగతిన ప్రక్రియ పూర్తి చేసేందుకు అదనంగా మరో సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తున్నారు. ఇబ్రహీంపట్నం కార్యాలయంలో నిత్యం 60 నుంచి 70కిపైగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈ విధానం ద్వారా ఒక్కో సబ్ రిజిస్ట్రార్ 48 రిజిస్ట్రేషన్ల మాత్రమే చేయాల్సి ఉంటుంది. పనిభారం తగ్గి, వేగంగా రిజిస్ట్రేషన్లు చేసేందుకు అదనపు సబ్ రిజిస్ట్రార్ తప్పనిసరి కావాల్సి ఉంటుంది. ఈ కార్యాలయానికి అదనపు సబ్ రిజిస్ట్రార్‌గా హనుమంతురావును నియమించినట్లు సమాచారం.

ఇబ్బందులు కలగకుండా..



సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. 15 నిమిషాల్లోపు రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. క్రయవిక్రయదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియ దోహదపడుతుంది.

– సోని, సబ్ రిజిస్ట్రార్, ఇబ్రహీంపట్నం

ఉపాధికి ఊతం



షెడ్‌లో జీవాలు

- పాడి పరిశ్రమకు రుణాలు
- ఔత్సాహికులకు కేంద్రం ప్రోత్సాహం
- సెంట్రల్ లైవ్‌స్టాక్ స్కీమ్ కింద సబ్సిడీ
- అవగాహన లేక ఆదరణ కరువు

కేశంపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు మాంసం ఉత్పత్తులను పెంచే లక్ష్యంతో కేంద్ర పశు సంవర్ధకశాఖ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పశువుల ఉత్పాదకతను పెంచడంతో పాటు పశువులకు మేత, దాణా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు ఔత్సాహికులకు సబ్సిడీ అందిస్తోంది. సబ్సిడీ పొందిన వారు ఐదేళ్ల వరకు కొనసాగించాల్సి ఉంటుంది. లేదంటే ఇచ్చిన నిధులను అధికారులు రికవరీ చేస్తారు.

దరఖాస్తు చేసుకోండి ఇలా..

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, పందుల పెంపకం కోసం 18 ఏళ్లు పైబడిన వారు వ్యక్తిగతంగా లేదా సామూహికంగా దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు వారు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంది. www.nlm.udyamimitra.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

కావాల్సిన పత్రాలు

ఆధార్‌కార్డు, చిరునామా ధ్రువీకరణ (ఓటర్‌ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాసుబుక్), కులధ్రువీకరణ, భూమి పట్టాదారు పాసుపుస్తకం, విద్యార్హత పత్రాలు, పాన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజ్‌ఫొటో, ప్రాజెక్టు ఏరియా ఫొటో, ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, మ్యాండెట్‌ఫాం, క్యాన్సిల్ చెక్కు, వెటర్నరీ డాక్టర్ చేత ధ్రువీకరించిన అనుభవం సర్టిఫికెట్, సీఏ చేత ధ్రువీకరించిన డిటైయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు.. ఇలా 13 రకాల పత్రాలను దరఖాస్తుతో పాటు జతచేయాల్సి ఉంటుంది.

అవగాహన లేక..

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకానికి కేంద్రం 2021–22 సంవత్సరంలో శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా సబ్సిడీ కింద రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అందిస్తారు. జిల్లా వ్యాప్తంగా 158 దరఖాస్తులు వచ్చాయి. అవగాహన లేకపోవడం, పథకం పూర్తి సమాచారం తెలియక చాలా మంది ముందుకు రావడం లేదు.

రెండు స్థాయిల్లో ఆమోదం

జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులు రాష్ట్ర, దేశ స్థాయిలో ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్ స్థాయి అధికారితో కూడిన స్టేట్ లెవల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, దేశ స్థాయిలో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీలు ఉంటాయి. జిల్లా స్థాయిలో వచ్చిన 158 దరఖాస్తులను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించారు. అక్కడ కమిటీ సభ్యులు 56 మాత్రమే ఆమోదించారు. స్టేట్ లెవల్ కమిటీ ఆమోదించిన దరఖాస్తులకు బ్యాంకులు రుణాలు మంజూరు (లెంటర్ అప్రూవల్) చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు 56 దరఖాస్తుల్లో 30కి మాత్రమే రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. వీటిని సెంట్రల్ లెవల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి పంపించారు. అక్కడి అధికారులు పరిశీలించి 25 దరఖాస్తులకు ఆమోద ముద్ర వేశారు. ఆమోదం పొందిన దరఖాస్తుల్లో 22 మందికి మొదటి విడతగా సబ్సిడీ అందించారు. మరో ముగ్గురికి రావాల్సి ఉంది.

అవగాహన కల్పించాలి



అవగాహన లేకపోవడంతోనే చాలా మంది దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఈ పథకంలో ఉండే ప్రయోజనాల గురించి అధికారులు అవగాహన కల్పిస్తే ఉపయోగపడుతుంది.

– తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కేశంపేట

దళారులను నమ్మొద్దు



ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా లోన్ మంజూరు చేయిస్తాం, సబ్సిడీ ఇప్పిస్తామంటే నమ్మొద్దు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బాబుభేరి, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- రూ.7.50 లక్షల విలువైన 300 కిలోల నిషేధిత విత్తనాలు స్వాధీనం
- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

షాద్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేసిన వారిని పోలీసులు పట్టుకొన్న సంఘటన షాద్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా చంద్రలపాడు గ్రామానికి చెందిన జంపాని నాగేశ్వర్‌రావు కొంత కాలంగా వికారాబాద్ జిల్లా ద్యాచర్ల గ్రామంలో కొంత పొలాన్ని రైతుల వద్ద కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పల్నాడు జిల్లా అమరావతి మండలానికి చెందిన వీర వసంతరావు ద్వారా నకిలీ పత్తి విత్తనాలు తెప్పిస్తున్నాడు. మేలైన విత్తనాలు అని నమ్మించి చుట్టుపక్కల ఉండే రైతులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి షాద్‌నగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నించారు. పట్టణ శివారులోని బక్కర్మన్ గార్డెన్ ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో నిషేధిత పత్తి విత్తనాలను కారులో తీసుకొచ్చి ముగ్గురు రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించారు. పక్కా సమాచారం అందుకున్న షాద్‌నగర్ వ్యవసాయ అధికారులు, ఎస్‌ఓటీ, షాద్‌నగర్ పోలీసులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని పట్టుకొన్నారు. వారి నుంచి రూ.7.5లక్షల విలువ చేసే 300కిలోల నకిలీ విత్తనాలను, కారును స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వర్‌రావు, వీర వసంతరావుతోపాటు వికారాబాద్ జిల్లా ఐయాన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు గంగారపు పాండు, దాచారం గ్రామానికి చెందిన టెక్నో సీడ్స్ కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ చాకలి రాములు, ఐనాపూర్‌కు చెందిన రైతు నెమలి రవిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్, ఏఈఓ తేజ్‌కుమార్, ఎస్‌ఐ శరత్‌కుమార్, మేడ్చల్ ఎస్‌ఓటీ ఎస్‌ఐ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి



అవయవదాన అంగీకారపత్రం అందిస్తున్న శ్రీనివాస్

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని ఆల్ ఇండియా ఆర్గాన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్ నేషనల్ కోఆర్డినేటర్ సోంటే శ్రీనివాస్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న మై హోమ్ జెవెల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుడూరు సీతామహాలక్ష్మి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ అవయవాలను దానం చేస్తున్నట్టు అంగీకారపత్రాన్ని గాంధీ మెడికల్ ప్రిన్సిపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను వదిలిపెట్టి మానవత దృక్పథంతో అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. మరణించిన తర్వాత శరీరాన్ని పూడ్చిపెట్టడం, కాల్చి వేయడంతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అందుకే అందరూ మరణాంతరం అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు.

మహిళ అదృశ్యం

యాచారం: కూలీ పనికంటూ ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దండుగుల శేఖర్ భార్య మమత(29) గత నెల 30న ఉదయం 7 గంటలకు కూలీకి పోతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రెండు రోజులైనా తిరిగి రాకపోవడం, ఆమె ఫోన్ కూడా స్విచ్చాఫ్ ఉంది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లల్లో వెతికినా జాడ లేదు. ఆదివారం మమత భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఫ్లై ఓవర్ పైనుంచి దూకి యువకుడి మృతి

గచ్చిబౌలి: భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గొట్టివాడ చిన్నా అలియాస్ సూర్య(28) ఐదేళ్ల క్రితం ఒడిశాకు చెందిన రమ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మాదాపూర్‌లో ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో వేర్వేరుగా ఉండేవారు. ఇటీవల కలిసిపోయిన వారు మళ్లీ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం భార్య తరుపు బంధువులు ఇంటికి రావడంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం భార్యతో గొడవపడిన సూర్య గచ్చిబౌలిలో ఉంటున్న తన సోదరి యమున ఇంటికి వెళ్లాడు. అతనుపలు మార్లు ఫోన్ చేసినా భార్య లిఫ్ట్ చేయలేదు. మధ్యాహ్నం సోదరి ఇంటి నుంచి బయటికి వచ్చిన అతను 'నేను వెళ్లి పోతున్నా, మీరు జాగ్రత్తగా ఉండండి' అంటూ అక్క, బావకు వాయిస్ మెసేజ్ పెట్టాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే కొత్తగూడ ఫ్లైఓవర్ పైకి ఎక్కిన అతను బొటానికల్ గార్డెన్ జంక్షన్‌లో కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని మసీద్‌బండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి సోదరి యమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగిన యువతి!


రేష్మా (ఫైల్)

ఇబ్రహీంపట్నం: చెరువులోకి దిగిన యువతి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. నగరంలోని ఫలక్‌నుమాకు చెందిన రేష్మా(24) బాలపూర్‌కు చెందిన ఆమె స్నేహితుడు ఖాసీంతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువు వద్దకు ఆటోలో వచ్చినట్లు తెలిసింది. ఖాసీం ఈత కొడుతుండగా రేష్మా కూడా చెరువులోకి దిగినట్లు సమాచారం. ఏమైయిందో ఏమోగాని ఆకస్మాత్తుగా యువతి చెరువు నీటిలో మునిగిపోయింది. చీకటి పడటంతో ఆమె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టలేదు. ఈ సంఘటన సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరి దుర్మరణం


కృష్ణయ్య మృతదేహం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. ముర్తుజపల్లి గేటు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన రాయకుంట కృష్ణయ్య(35), ఆయన బంధువు శేఖర్ పని నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరు ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై సొంతూరికి బయలుదేరారు. మార్గమధ్యలో పట్టణ సమీపంలోని ముర్తుజపల్లి గేటు వద్ద అతివేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా, శేఖర్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డయాలసిస్ చికిత్సకు నీటి కష్టాలు

శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి
- నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న వైద్యులు
- మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి


శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కోసం వచ్చిన బాధితులు

శంషాబాద్: ప్రభుత్వ దవాఖానాకు డయాలసిస్ రోగుల తాకిడి పెరుగుతోంది. గతంలో ప్రయివేటు లేదా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితమైన డయాలసిస్ చికిత్స గత ఆరునెలలుగా ప్రభుత్వ దవాఖానాలో అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే ఉండి డయాలసిస్ చికిత్స అవసరమైన రోగులు ఇప్పుడు ప్రభుత్వ దవాఖానా బాటపడుతున్నారు.

నీరే ప్రధానం...

డయాలసిస్ చికిత్సలో అత్యంత ప్రధానమైంది పూర్తిగా మంచినీరే. నీటితో పూర్తిగా డయాలసిస్ చికిత్సను అందజేస్తారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానాలో ఆరు నెలల కిందట డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని కోసం ప్రత్యేక గదితో పాటు ఐదు మంచాలు ఏర్పాటు చేశారు. ఒకే సమయంలో ఐదుగురు రోగులకు ఇక్కడ చికిత్స చేయడానికి కావాల్సిన పరికరాలతో పాటు అవసరమైన టెక్నీషియన్లు, నర్సులు కూడా ఉన్నారు. అన్ని ఉన్నా డయాలసిస్‌కు కావల్సిన ప్రధాన వనరైన మంచి నీరు మాత్రం కావల్సినంతగా లేదు. దీంతో మూడు షిప్టులుగా సేవలందించేందుకు అవకాశమున్నా ప్రస్తుతం ఇక్కడ రోజు ఏడుగురు రోగులకు మాత్రమే డయాలసిస్ చికిత్సను అందజేస్తున్నారు. దవాఖానాలో ఉన్న బోరులో నీరు సరిపోకపోవడంతో మున్సిపాలిటీ ట్యాంకరును ఆశ్రయిస్తున్నారు. అయినా నీరు అవసరాలకు సరిపడా అందుబాటులో లేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు తప్పని నిరీక్షణ

మంచి నీటి కొరత కారణంగా కొత్తగా డయాలసిస్ కోసం వస్తున్న రోగులకు చికిత్స అందించలేని పరిస్థితి నెలకొంటుంది. నీటి సమస్య తీరితే రోగుల సేవలను పెంచేందుకు పూర్తి అవకాశాలున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో రోగులు తమకు స్థానికంగానే డయాలసిస్ చికిత్స అందించాల్సిందిగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సిఫార్సులు సైతం చేయించుకుంటున్నారు.

దాతలు ముందుకొస్తే...

ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ రోగులతో పాటు సాధారణ రోగులకు సైతం నీటి కష్టాలు తీర్చేందుకు మరో బోరు వేయాల్సిన అవసరముంది. ప్రభుత్వ ఏర్పాటు చేసే లోపు దాతలు ముందుకొచ్చి బోరు వేయించి నీటి సమస్యను తీర్చితే రోగులకు సాంత్వన చేకూరుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరో వైపు కొత్త ఆస్పత్రి నిర్మాణం త్వరగా చేపడితే నీటి కష్టాలు తీరే మార్గాలున్నాయని వైద్యులు, సిబ్బంది ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి



డయాలసిస్ చికిత్సకు వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. డయాలసిస్ చికిత్సకు గదితోపాటు అన్ని పరికరాలు, టెక్నీషియన్లు, నర్సులు పూర్తి స్థాయిలో ఉన్నారు. చికిత్సకు ప్రధానమైన నీరే ఇక్కడ కొరతగా ఉంది. సమస్యను ఉన్నతాధికారులతో దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం బోరు సరిగా రావడం లేదు. మున్సిపాలిటీ ట్యాంకరుతో నీటి సరఫరా చేస్తుంది. సమృద్ధిగా నీటి సౌకర్యం పెరిగితే మూడు షిప్టుల్లో డయాలసిస్ చికిత్సను పెంచేందుకు అవకాశముంటుంది.

– డాక్టర్ దుర్గలత, ఆస్పత్రి సూపరింటెండెంట్

రోడ్డు ప్రమాదంలో సినీ దర్శకుడికి గాయాలు

ఫిలింనగర్: బైక్‌పై ఇంటికి వెళ్తున్న సినీ దర్శకుడిని రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..మణికొండలో నివాసం ఉంటున్న శివ నాగేంద్రనాథ్‌రెడ్డి (27) సినీ దర్శకుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను షూటింగ్ ముగించుకుని షేక్‌పేట మీదుగా బైక్‌పై మణికొండకు వెళ్తున్నాడు. అదే సమయంలో మద్యం మత్తులో కారు నడుపుతున్న షేక్ రఫీ, షేక్ అజహరుద్దీన్, అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో పాటు షేక్ ఫిరోజ్ రాంగ్ రూట్‌లో కారులో వెళ్తున్నారు. మణికొండలో మద్యం సేవించిన వీరు బిర్యానీ తినేందుకు గచ్చిబౌలి వెళ్లి తిరిగి వస్తుండగా కారులో పెట్రోల్ అయిపోయింది. దీంతో షేక్‌పేట డీమార్ట్ వద్ద పెట్రోల్ పోయించుకున్న వీరు రాంగ్ రూట్‌లో మణికొండ వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న శివనాగేంద్రనాథ్‌రెడ్డిని ఢీకొట్టారు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారకులైన రఫీ, ఫిరోజ్, అజహరుద్దీన్‌లను అదుపులోకి తీసుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కారు నడుపుతున్న రఫీతో పాటు పక్కన కూర్చొన్న ఇద్దరూ మద్యం సేవించినట్లు తేలింది. అర్ధరాత్రి మద్యం మత్తులో కారులో దూసుకెళ్లడమే కాకుండా రాంగ్‌రూట్‌లో వస్తూ ప్రమాదానికి కారకులైన వీరిని అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబ్ చానల్‌పై పోలీసులకు ఫిర్యాదు

రాజేంద్రనగర్: తమ ప్రతిష్టకు భంగం కలిగేలా వార్తలు ప్రసారం చేసినందుకు రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ మహ్మద్ ఫయీం ఖురేషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాజేంద్రనగర్ పోలీసులు ఓ యూ ట్యూబ్ నిర్వాహకుడితో పాటు మరో వ్యక్తిని స్టేషన్‌కు రప్పించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఇంగ్లాండ్ దేశానికి చెందిన కంటెస్టెడ్ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ మహ్మద్ ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఫొటోలతో పాటు వారి పేర్లను పేర్కొంటూ వార్త ప్రచురించారు. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై ఫయీం ఖురేషి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం ఉప్పల్‌కు చెందిన గౌతం గౌడ్‌తో పాటు టౌలిచౌకి ప్రాంతానికి చెందిన ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడు వసీంలను స్టేషన్‌కు పిలిపించారు. వారిని విచారించి 35(3) సీఆర్‌పీ ప్రకారం నోటీసులు అందజేశారు. మూడు రోజుల తర్వాత మరోమారు స్టేషన్‌లో హాజరు కావాలని సూచించారు. వసీం తన వద్దకు వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను ఎలాంటి విచారణ లేకుండా పోస్టు చేశానని.. దీంతో ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిని క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపాడు. గౌతం గౌడ్ తెలుగు స్ట్రైక్ పత్రికకు తనకు ఎలాంటి సంబంధం లేదని... గతంలోనూ ఇదే విషయాన్ని గచ్చిబౌలి పోలీసులకు చెప్పినట్లు తెలిపాడు. సదరు పత్రిక ఓ పార్టీ నేతలు నడిపిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఎప్పుడు కోరితే అప్పుడు తాను హాజరవుతానని వెల్లడించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నవాబుపేట: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య భరోసా ఇచ్చారు. ఆదివారం మండల పరిధిలోని గంగ్యాడలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాది పేదల ప్రభుత్వం ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగదన్నారు. విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ దశలను బట్టి బిల్లులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందమ్మ, నాయకులు మల్లేశం, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను సనత్‌నగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భరత్‌నగర్‌కాలనీకి చెందిన గరక గణేష్ డిగ్రీ చదివాడు. ఓ మెడికల్ షాపులో పని చేస్తున్న అతడికి జీతం ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీంతో తన స్నేహితుడు మూసాపేట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వడ్ల పవన్‌తో జత కట్టాడు. పవన్ స్నేహితుడైన మధు గంజాయి అవసరమైన వారికి సరఫరా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గణేష్, పవన్ రెండు రోజుల క్రితం రూ.25 వేలు ఇచ్చి మధు నుంచి 1.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వీరు మూసాపేట సంగీత మొబైల్స్ ఎదుట గంజాయి విక్రయిస్తున్నట్లుగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి నుంచి చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా గంజాయి దందా చేస్తున్న వీరు ఇప్పటి వరకు 15 మందికి విక్రయించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిందితులు గణేష్, పవన్‌లను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 1.1 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలి–చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి ఆధారాలు లభ్యం కాలేదని దాదాపు 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి రైలు కిందపడి ఆత్యహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై పసుపు రంగు టీషర్టు, బిస్కెట్ రంగు లుంగీ ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సంచిని పడేసి.. పుస్తెలతాడుని తెంచేసి

వృద్ధురాలి మెడలో మంగళసూత్రం అపహరణ


బాధితురాలు లక్ష్మమ్మ

ఇబ్రహీంపట్నం: కూరగాయల కోసమొచ్చిన వృద్ధురాలి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని ఓ దుండగుడు అపహరించుకొని పరారైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(65) ఇబ్రహీంపట్నంలోని మార్కెట్‌కు ఆదివారం ఉదయం వచ్చింది. అక్కడ కూరగాయలు తీసుకొని తలపై పెట్టుకొని వెళుతుంది. ముఖానికి మంకి క్యాప్ ధరించిన దుండగుడు నడుచుకుంటూ వచ్చి ఆమె తలపై సంచిని కిందపడేసి మెడలోని నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచుకొని పరారయ్యాడు. దీంతో వృద్ధురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు, సీఐ జగదీశ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్టు


నిందితుడు శ్రవణ్‌కుమార్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిన కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ అమాయకులను ఎంచుకుని కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్నాడు. 2009 నుంచి 2024 వరకు బేగంపేట, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 6 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. శ్రీలేఖ అనే మహిళ నుంచి రూ.22వేలు తీసుకుని ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. పవన్ అనే వ్యక్తి నుంచి రూ.35వేలు, విశాల్ అనే వ్యక్తి నుంచి రూ.20వేలు, మరో వ్యక్తి నుంచి రూ.35వేలు, వేములవాడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.50వేలు తీసుకుని కంటోన్మెంట్ బోర్డులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడు. గత కొన్నాళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి పోలీసులు అప్పగించారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మల్లిపెద్ది వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి భార్య, కుమార్తెతో కలిసి కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 30న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. చింతల్‌లో ఉంటున్న అతడి బావ రాజశేఖర్‌రెడ్డికి గాలింపు చేపట్టగా వెంకట్‌రెడ్డి భరత్‌నగర్‌లోని ఓయో లివింగ్ ట్రీ రూమ్ నెంబర్ 301లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ విషయమై మృతుడి తండ్రి మల్లారెడ్డికి సమాచారం అందించడంతో ఆయన సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకట్ రెడ్డి ఇటీవలే ఇల్లు కొనుగోలు చేశాడని, అప్పుల భారం ఎక్కువ కావడంతో మనస్తాపానికిలోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అతను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ కమిటీ తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లి ఇందిరమ్మ కమిటీ తీరుపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు బాత్కు నర్సింహా యాదవ్, జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ... పదో వార్డులోని ఇందిరమ్మ కమటీని స్థానిక మాజీ కౌన్సిలర్ తనయుడు అస్తవ్యస్తంగా మార్చారని ఆరోపించారు. ఆయనతో పాటు మిగతా సభ్యులు కూడా బీఆర్‌ఎస్ నేతలేనన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసే కమిటీలో అధికారులు ఇలాంటి వారికి ఎలా చోటు కల్పించారని ప్రశ్నించారు. ఎస్సీలకు కూడా కమిటీలో చోటు ఇవ్వలేదని ఆగ్రమం వ్యక్తం చేశారు. కమిటీ తీరు కారణంగా స్థానికంగా ఉన్న అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కల్పించుకుని సవరించాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్, నర్సింహా, ఖదీర్, పి.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

'జయ గ్రూప్స్'పై చర్యలు తీసుకోవాలి

- ప్రీ లాంచింగ్ ఆఫర్ల పేరుతో నిండా ముంచారు
- రూ.300 కోట్లకు పైగా వసూలు
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

పంజగుట్ట: తమ వద్ద ప్రీ లాంచింగ్ ఆఫర్‌లో ప్లాట్లు తీసుకుంటే తక్కువ ధరకు ఇస్తామంటూ అందంగా బ్రోచర్లు ముద్రించి వందలాది మంది నుంచి దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేసిన జయత్రి రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ (జయ గ్రూప్స్) సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వర్మ కుమార్, మూర్తి శ్రీనివాస్, ప్రసాద్ శివపురం, గణేష్, ఫణిలు మాట్లాడుతూ .. కాకర్ల శ్రీనివాస్ అనే వ్యక్తి మరో 19 మంది డైరెక్టర్లతో కలిసి 2021 ఫిబ్రవరిలో కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేస్‌లో అన్ని హంగులతో కార్యాలయం ఏర్పాటు చేశారని మొదటి వెంచర్‌గా హిల్టన్ జయ డైమెండ్ పేరుతో వెంచర్ ప్రారంభించినట్లు తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తమకు పదేపదే ఫోన్లు చేసి చందానగర్ లోని గోపనపల్లిలో తక్కువ ధరకు ప్లాట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారన్నారు. కార్యాలయానికి వెళ్లగా హంగు, ఆర్భాటాలతో పాటు దాదాపు వంద మందికి పైగా ఉద్యోగులు అక్కడ పని చేస్తున్నారన్నారు. సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మి రూ. 20 లక్షల నుంచి రూ.1.80 కోట్ల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. రెండేళ్లలో ప్లాట్లు అప్పగిస్తామని చెప్పారని. గడువు ముగిసిన తర్వాత అడిగితే నేడు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో తమకు చూపించిన స్థలం వద్దకు వెళ్లి ఆరా తీయగా సదరు ప్రాజెక్టు వేరే సంస్థకు చెందినదిగా తెలుసుకుని నివ్వెరపోయామన్నారు. మధ్య తరగతికి చెందిన తాము పైసాపైసా కూడబెట్టుకుని ప్లాట్లు కోసం వెచ్చించామన్నారు. ఇదే సంస్థ గతంలో రాజమండ్రిలోనూ ఇదేతరహాలో మోసం చేసినట్లు తెలిసిందన్నారు. నిందితుడు కాకర్ల శ్రీనివాస్, మరోఇద్దరు డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రస్తుతం బెయిల్‌పై దర్జాగా తిరుగుతున్నారన్నారు. ఈ విషయమై పలు మార్లు పోలీసులకు, ఈడీ కార్యాలయంలో, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సంస్థ బాధితుల్లో రెండు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని ఇరు ప్రభుత్వాలు చొరవ తీసుకుని నిందితులను అరెస్టు చేయాలని, వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.